# పదో తరగతి తెలుగు పేపర్-2 మోడల్ పేపర్

**సమయం: 2 గం. 45 ని.**

**గరిష్ట మార్కులు: 50**

**విద్యార్థులకు సూచనలు:**

*1. ప్రశ్నపత్రంలో మూడు విభాగాలు ఉంటాయి.*
*2. ప్రశ్నపత్రం చదువుకోవడానికి 15 నిమిషాలు, జవాబులు రాయడానికి 2-30 గంటల సమయం ఉంటుంది.*
*3. అన్ని ప్రశ్నలకు సమాధానాలు సమాధానపత్రంలోనే రాయాలి.*
*4. సమాధానాలు స్పష్టంగా, గుండ్రంగా రాయాలి.*

## 1. అవగాహన - ప్రతిస్పందన

(16 మార్కులు)

**1. రామాయణంలోని ఒక కాండ నుంచి ఇచ్చిన వానిని సంఘటననుసరించి సరైన క్రమంలో రాయండి.**

4 × 1 = 4

అ) ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ సీతకు శుభశకునాలు తోచాయి.
ఆ) ఎక్కడా సీత జాడ కనిపించలేదు.
ఇ) త్రికూట పర్వతం మీదున్న లంకకు చేరాడు హనుమంతుడు.
ఈ) అప్పటివరకు వెతకని అశోకవనంలోకి వెళ్లాలనుకున్నాడు హనుమంతుడు.

**2. కింది అపరిచిత పద్యాన్ని చదివి, అర్థవంతంగా భావం రాయండి.** 1 × 4= 4

ఎంత చదువు చదివి యెన్నిటి విన్నను
హీనుడవగుణంబు మానలేడు
బొగ్గు పాలఁగడుగఁ బోవునా నైల్యంబు
విశ్వదాభిరామ! వినుర వేమ!

(లేదా)

వినదగు నెవ్వరు చెప్పిన
వినినంతనె వేగపడక వివరింపదగున్
కనికల్ల నిజము తెలిసిన
మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ!

- **కింది అపరిచిత గద్యాన్ని చదివి, ప్రశ్నలకు సమాధానాలు రాయండి.** 4 × 1= 4

శ్రీకృష్ణ దేవరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన రాజుల్లో అగ్రగణ్యుడు. వీరి ఆస్థానంలో అష్ట దిగ్గజాలనే పేరుతో ఎనిమిది మంది కవి పండితులుండేవారు. వారిలో అల్లసాని పెద్దన మొదటివాడు. ఈయన 'మను చరిత్రము'' అనే ప్రబంధాన్ని రాశాడు. శ్రీకృష్ణ దేవరాయలు తాను స్వయంగా కవి, కళాపోషకుడు. ఈయన 'ఆముక్త మాల్యద' అనే ప్రబంధాన్ని రాశారు. దీనికి 'విష్ణుచిత్తీయం' అనే నామాంతరం ఉంది. ఈయన ఆస్థానంలో 'వికటకవి' అనే పేరు గాంచిన తెనాలి రామకృష్ణ కవి 'పాండురంగ మాహాత్మ్యం' అనే కావ్యాన్ని రాశారు.

**ప్రశ్నలు:**

**3.** అష్టదిగ్గజ కవులు ఎవరి ఆస్థానంలో ఉండేవారు?
**4.** 'విష్ణుచిత్తీయం' అనే నామాంతరం కలిగిన ప్రబంధం ఏది?
**5.** 'మనుచరిత్రము' అనే ప్రబంధాన్ని రచించిందెవరు?
**6.** గద్యాంశం ఆధారంగా ఒక ప్రశ్న తయారు చేయండి.

- ***కింది కరపత్రం చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.*** 4 × 1= 4

**బాలల హక్కుల వారోత్సవాలు**

**అందరూ చదవాలి** **అందరూ ఎదగాలి**

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వాల్లో, సామాజిక సంస్థల్లో చాలా మార్పులు వచ్చాయి. ఫలితంగా పిల్లల చాకిరీని వ్యతిరేకిస్తూ, వారి శ్రమ దోపిడీని నిరసిస్తూ బాల కార్మికతకు వ్యతిరేకంగా పలు కార్యక్రమాలు జరిగాయి. చట్టాలు రూపుదిద్దుకున్నాయి. ఈ క్రమంలో ఐక్యరాజ్య సమితి 1989లో బాలల హక్కులను నిర్వచించి, వాటి అమలుకు పూనుకుంది. ఈ హక్కుల తీర్మానంపై మన దేశం కూడా సంతకం చేసింది.

ఈ నేపథ్యంలో ఆగస్టు 2009లో భారత ప్రభుత్వం బాలల విద్యా హక్కును ప్రాథమిక హక్కుగా చట్టం చేసింది. మన రాష్ట్రంలో 2010 ఏప్రిల్ 4 నుంచి నిర్బంధ ఉచిత విద్యా హక్కు చట్టం అమలులోకి వచ్చింది. ఈ చట్టం గురించి తల్లిదండ్రులకు సమాజ సభ్యులకు అవగాహన కల్పించడానికి బాలల దినోత్సవం సందర్భంగా నవంబరు 14 నుంచి 21 వరకు బాలల హక్కుల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు.

'ఈ వారోత్సవాల్లో మనమందరం భాగస్వాములమవుదాం'
'పిల్లలను బడిలో చేర్పిద్దాం - నాణ్యమైన విద్యను పొందేలా చూద్దాం''

సంచాలకులు,
పాఠశాల విద్యాశాఖ, ఆంధ్రప్రదేశ్.

**ప్రశ్నలు:**

**7.** ఈ కరపత్రాన్ని విడుదల చేసిందెవరు ?
**8.** మన రాష్ట్రంలో ఎప్పటి నుంచి నిర్బంధ ఉచిత విద్యాహక్కు చట్టం అమలులోకి వచ్చింది ?
**9.** కరపత్రంలోని ముఖ్య విషయం ఏమిటి?
**10.** కరపత్రం ఆధారంగా ఒక ప్రశ్నను తయారు చేయండి.

## 2. వ్యక్తీకరణ - సృజనాత్మకత

(22 మార్కులు)

**కింది ప్రశ్నలకు నాలుగు లేక ఐదు వాక్యాల్లో సమాధానాలు రాయండి.** 5 × 2 = 10

**11.** విశ్వామిత్రుని పాత్ర స్వభావం రాయండి.
**12.** 'కైకా! రాముడు నీకేం అపకారం చేశాడు? భరతుడికన్నా ఎక్కువగా నిన్ను సేవించాడు. అటువంటి వాణ్ణి అడవుల పాలు చేయమని అడగడానికి నీకు నోరెలా వచ్చింది?' అని పలికిన దశరథుని మాటలను బట్టి మీరేమి గ్రహించారు?
**13.** మారీచుడు బంగారు జింకగా మారిన సంఘటన మీకు తెలుసుకదా ! అందుకు గల కారణాలు ఏమిటి?
**14.** సీత జాడ తెలుసుకోవడంలో సుగ్రీవుని సేన రామునికి ఎలా సహాయపడిందో రాయండి.
**15.** తనను శరణుగోరిన విభీషణుణ్ణి శ్రీరాముడు అనుగ్రహించిన విధానాన్ని రాయండి.

**కింది ప్రశ్నకు పది లేక పన్నెండు వాక్యాల్లో సమాధానం రాయండి.** 1 × 4 = 4

**16.** రామాయణం ప్రాశస్త్యాన్ని రాయండి

(లేదా)

శ్రీరామ సుగ్రీవుల మైత్రి ఎలా ఏర్పడింది? వివరించండి.

- **కింది ప్రశ్నలకు సృజనాత్మకంగా సమాధానాలు రాయండి.** 2 × 4=8

**17.** విద్వాన్ విశ్వం కవితా శిల్పాన్ని ప్రశంసిస్తూ మీ మిత్రునికి లేఖ రాయండి.

(లేదా)

తెలుగు భాష గొప్పదనంపై ఒక కరపత్రం తయారుచేయండి.

**18.** ఒక ప్రముఖ రచయిత్రి మీ పాఠశాలకు విచ్చేసిన సందర్భంలో ఆమెను ఎలా ఇంటర్వ్యూ చేస్తారో ఆలోచించి పది ప్రశ్నలు తయారుచేయండి.

(లేదా)

'భారతదేశం - అవినీతి నిర్మూలనం' పై ఒక వ్యాసం రాయండి.

## 3. భాషాంశాలు

(12 మార్కులు)

- **కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

3 × 2 = 6

**19.** 'భగీరథ ప్రయత్నం' అనే జాతీయం అర్థాన్ని వివరించి, సొంతవాక్యంలో ప్రయోగించండి.
**20.** 'నీళ్ళు వెళ్లిపోయిన తరువాత నదికి ఆనకట్ట కట్టడం' అని చెప్పడానికి ఏ జాతీయాన్ని ఉపయోగిస్తాం? ఆ జాతీయంతో సొంతవాక్యాన్ని రాయండి.
**21.** విద్యార్థులందరూ మంచి క్రమశిక్షణను కలిగియుండా లని ఉపాధ్యాయులు చెవినిల్లు కట్టుకొని పోరుతు న్నారు.
ఈ వాక్యంలో గల జాతీయాన్ని గుర్తించి, దానిని ఏ సందర్భంలో ఉపయోగిస్తారో రాయండి.

- ***కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.***

12 × ½ = 6

**22.** పరధనాపహరణము కంటె దిరియుట మంచిది.
(ఈ వాక్యాన్ని ఆధునిక వచనంలో రాయండి.)
**23.** మునివర ! నీవు శిష్యగణముంగొని చయ్యనరమ్ము. (ఈ వాక్యానికి సరైన ఆధునిక వచనాన్ని గుర్తించి రాయండి.)
అ) మునివరా! నీవు శిష్యులను తీసుకొని వెంటనే రా. ఆ) మునివరా! నీవు శిష్య గణంబును గైకొని రమ్ము, ఇ) మునివరా! నీవు శిష్య గణంబుతో శ్రీఘ్రముగా రా. ఈ) మునివరా ! నీవు శిష్యులను తీసుకొని వేగంబుగా రమ్ము.
**24.** వాల్మీకిచే రామాయణం రచింపబడింది.
రామాయణాన్ని వాల్మీకి రాశాడు.
వాల్మీకి రామాయణం రాసిపెట్టాడు.
వాల్మీకి రామాయణాన్ని రచించాడు.
పై నాలుగు వాక్యాల్లో గల సరైన కర్మణి వాక్యాన్ని గుర్తించి రాయండి.

www.sakshieducation.com

**25.** కైకేయిచే రెండు వరాల గురించి చెప్పబడింది.
(ఈ వాక్యాన్ని కర్తరి వాక్యంగా మార్చి రాయండి.)

**26.** 'నాకు వెన్నెలంటే చాలా ఇష్టం' అని మహేశ్ అన్నాడు.
(ఈ వాక్యాన్ని పరోక్ష కథనంలోకి మార్చి రాయండి.)

**27.** కింది వాక్యాల్లో గల సరైన ప్రత్యక్ష కథనాన్ని గుర్తించి రాయండి.
అ) 'ఉపాధ్యాయులు చెప్పినట్లుగా నడచుకొంటామని' విద్యార్థులు చెప్పారు.
ఆ) 'తమ ఉపాధ్యాయులు చెప్పినట్లుగా నడుచుకోము' అని విద్యార్థులు చెప్పారు.
ఇ) 'మా ఉపాధ్యాయులు చెప్పినట్లుగా నడచుకొంటాము' అని విద్యార్థులు చెప్పారు.
ఈ) మా ఉపాధ్యాయులు చెప్పినట్లుగా నడచుకొంటామని విద్యార్థులు చెప్పారు.

**28.** మనస్విని బహుమతి సంపాదించింది.
(ఈ వాక్యం వ్యతిరేకార్థక వాక్యంగా మారినప్పుడు ఇలా మారుతుంది.)
మనస్విని బహుమతి ________

**29.** కింది పదాల్లో వ్యతిరేకార్థాన్నిచ్చే క్రియను గుర్తించి రాయండి.
చేసి, చూసి, తిని, వెళ్లక

**30.** కింది వాటిలో సరైన జతను ఎంపిక చేయండి.
అ) వస్తూ, పోతూ – క్త్వార్థాలు
ఆ) వస్తే, పోతే – చేదర్థాలు
ఇ) వచ్చినా, పోయినా – శత్రర్థాలు
ఈ) వచ్చి, పోయి – అప్యర్థాలు

**31.** దయచేసి సెలవు మంజూరు చేయండి.
(ఇది ఏ రకమైన వాక్యమో రాయండి.)

**32.** శ్రీదేవి వంట చేయగలదు.
(ఇది ఏ రకమైన వాక్యమో గుర్తించి రాయండి.)
అ) సంయుక్త వాక్యం
ఆ) సంశ్లిష్ట వాక్యం
ఇ) సామర్థ్యార్థక వాక్యం
ఈ) సందేహార్థక వాక్యం

**33.** 'మీరు బయటకు వెళ్లవచ్చు' అనే అనుమత్యర్థక వాక్యాన్ని నిషేధార్థక వాక్యంగా మార్చి రాయండి.

## సమాధానాలు

### 1. అవగాహన - ప్రతిస్పందన

**1.** ఇ, ఆ, ఈ, అ
ఇ) త్రికూట పర్వతం మీదున్న లంకకు చేరాడు హనుమంతుడు.
ఆ) ఎక్కడా సీత జాడ కనిపించలేదు.
ఈ) అప్పటివరకు వెతకని అశోకవనంలోకి వెళ్లాలనుకున్నాడు హనుమంతుడు.
అ) ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ సీతకు శుభశకునాలు తోచాయి.

**2.** ఓ వేమా! నీచ గుణములు గలవాడు ఎంత చదివిననూ, ఎన్ని మంచి మాటలు విన్ననూ, తన చెడ్డ గుణములను మానడు. నల్లని బొగ్గును తెల్లని పాలతో ఎంతగా కడిగిననూ ఆ బొగ్గుకున్న సహజమైన నలుపు పోదుకదా అని భావం.

(లేదా)

ఓ సుమతీ ! ఎవ్వరు చెప్పినా వినాలి. విన్న తరువాత తొందరపడక బాగా ఆలోచించాలి. అలా ఆలోచించి, ఏది అబద్ధమో, ఏది నిజమో తెలుసుకోగలవాడే నీతిని తెలిసినవాడని భావం.

**3.** శ్రీకృష్ణదేవరాయల వారి ఆస్థానం
**4.** ఆముక్త మాల్యద
**5.** అల్లసాని పెద్దన
**6.** పాండురంగ మాహాత్మ్యమును రచించిందెవరు?
**7.** ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ సంచాలకులు
**8.** 01. 04. 2010 నుంచి
**9.** బాలల హక్కులు
**10.** బాలల హక్కుల అమలుకు పూనుకొన్నదెవరు?

### 2. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**11.** విశ్వామిత్రుడు సృష్టికి ప్రతిసృష్టి చేయగల సమర్థుడు. మహా తేజశ్శాలి. తాను చేయ సంకల్పించిన యాగ సంరక్షణకు రామలక్ష్మణులను వెంట తీసుకువెళ్లాడు. వారికి బల, అతిబల విద్యలను ఉపదేశించాడు. శ్రీరాముని వంశ చరిత్రను తెలిపాడు. రాముని ద్వారా అహల్యకు శాప విముక్తిని కలిగించాడు.

**12.** దశరథుడు కైకతో పలికిన మాటలను బట్టి... శ్రీరాముని పట్ల దశరథునికి అమితమైన పుత్రవాత్సల్యం కలదని గ్రహించాను. శ్రీరాముణ్ణి తన ప్రాణానికి ప్రాణంగా భావించేవాడు దశరథుడని గ్రహించాను. కనుకనే కైక తన కోరికలను గురించి ప్రస్తావించగానే దశరథుడు తట్టుకోలేక పోయాడని గ్రహించాను. ఎవరికీ అపకారం చేయని గుణం రామునిదని గ్రహించాను. పినతల్లిని కూడా కన్నతల్లితో సమానంగా శ్రీరాముడు చూసేవాడని గ్రహించాను. అటువంటి మంచి పుత్రుణ్ణి కైక అడవులకు పంపమని అడగడం అన్యాయమని గ్రహించాను.

**13.** రావణాసురుడు సీతను అపహరించడానికి మారీచుని సహాయమర్థించాడు. ప్రశాంతంగా ఉన్న రాముణ్ణి కవ్వించడం కొరివితో తల గోక్కోవడం వంటిదని, ఆ ఆలోచన విరమించుకోమని మారీచుడు సదుపదేశం చేశాడు. అప్పటికి శాంతించి వెళ్లిన రావణుడు తిరిగి మారీచుని వద్దకు వచ్చి బంగారు లేడిగా మారి తనకు సహకరించమన్నాడు. నేను చెప్పినట్లు చేయకుంటే నా చేతిలో నీకు చావుతప్పదని రావణుడు హెచ్చరిం చాడు. దాంతో రావణుని చేతిలో చావడం కన్నా శ్రీరాముడి చేతిలో చావడమే నయమనుకొని మారీచుడు బంగారు లేడిగా మారాడు.

**14.** శ్రీరాముని సూచన మేరకు సుగ్రీవుడు వానర వీరులను నలుదిక్కులకు పంపాడు. ఎవరెవరు ఏయే దిక్కులకు వెళ్లాలో నిర్ణయించి పంపాడు. నెల రోజుల్లో సమాచారం తెమ్మని ఆజ్ఞాపించాడు. తూర్పు, పడమ ర, ఉత్తరం దిక్కులకు వెళ్లిన సైన్యం రిక్తహస్తములతో తిరిగి వచ్చింది. అంగదుని నాయకత్వంలో, వానర వీరుల ప్రోత్సాహంతో హనుమంతుడు దక్షిణం వైపునకు వెళ్లాడు. లంకలో అణువణువునా గాలిం చాడు. అశోకవనంలో సీతను చూశాడు. రామునికి సమాచారం ఇచ్చాడు. ఈ విధంగా సుగ్రీవుని సేన సీత జాడతెలుసుకొని రామునికి సహాయపడింది.

**15.** సీతను అపహరించిన రావణుణ్ణి తమ్ముడైన విభీషణుడు తప్పుపట్టాడు. అది ధర్మానికి ఆటంకమవుతుందని, సుఖాలను దూరం చేస్తుందని హితవుపలికాడు. తమ్ముడి మాటలకు అన్న రావణుడు క్రోధావేశాలకు లోనయ్యాడు. తీవ్రంగా నిందించాడు. అన్న తండ్రితో సమానమని, అతని నిందలను సహించాడు విభీషణుడు. కానీ రావణుని అధర్మమార్గాన్ని మాత్రం సమర్థించలేదు. ధర్మం వీడిన రావణుని వీడడానికే విభీషణుడు నిర్ణయించు కున్నాడు. శ్రీరాముని శరణు కోరాడు. శ్రీరాముడు అనుగ్రహించాడు.

**16.** మానవ జీవితాన్ని సంస్కరించగల మహాకావ్యం రామాయణం. మానవ హృదయాల నుంచి ఎప్పటికీ చెరగని కథ. 'అమ్మానాన్నల అనురాగం, పుత్రుల అభిమానం, అన్నదమ్ముల అనుబంధం, భార్యాభర్త ల సంబంధం, గురుభక్తి, శిష్యానురక్తి, స్నేహఫలం, ధర్మబలం, వినయంతో ఒదగడం, వివేకంతో ఎదగ డం, జీవకారుణ్య భావన, ప్రకృతిలాలన' – ఇలా జీవిత పార్శ్వాలనెన్నింటినోపట్టి చూపిస్తుంది రామాయణం.

రామాయణాన్ని చదవడమంటే జీవితాన్ని చదవడమే. రామాయణం పారాయణ గ్రంథంకాదు. ఆచరణ ప్రధాన గ్రంథం. ఉత్తమ ధర్మాలను ఆచరిస్తే మనిషి మనీషిగా ఎలా ఎదగగలడో నేర్పుతుంది. చిన్న చిన్న పాత్రల ద్వారా సమున్నత సందేశాన్నందిస్తుంది. 'రామో విగ్రహవాన్ ధర్మః సత్యధర్మ పరా క్రమః' అన్న మహితోక్తిని మారీచుని నోటి నుంచి వాల్మీకి మహర్షి పలికించాడు. రాముని వంటి ఆదర్శమూర్తి, రామాయణంవంటి ఆదర్శకావ్యం 'నభూతో నభవిష్యతి!' మనిషి ఉన్నంతకాలం రామాయణం ఉంటుంది

ప్రపంచ సాహిత్యంలోనే ఆదికావ్యం రామాయణం. వాల్మీకి మహర్షి దీనిని రచించి 'ఆదికవి'గా కీర్తి పొందాడు. 'రామాయణం పౌలస్త్యవధ, సీతాయాశ్చరితం మహత్' అనే మూడుపేర్లు దీనికున్నాయి. ఆరు కాండలతో, ఇరవై నాలుగు వేల శ్లోకాలతో, సంస్కృత భాషలో సాగిన రచన ఇది. తరువాతి కాలంలో ఎన్నో రామాయణాలు వచ్చాయి. మన దేశంలోనే కాదు ప్రపంచంలోని పలుదేశాల్లో ఈ రామాయణ కథ మనకు కనిపిస్తుంది.

(లేదా)

వాలి, సుగ్రీవుడు అన్నదమ్ములు. రామలక్ష్మణులు సుగ్రీవునితో మైత్రి చేయాలని సుగ్రీవుడు ఉంటున్న ఋష్య మూక పర్వతం దగ్గరకు వచ్చారు. సుగ్రీవుడు రామలక్ష్మణులను చూసి వాలి తనను చంపడానికి పంపిన వీరులని భయపడ్డాడు. రామ లక్ష్మణులను గురించి తెలుసుకోమని తన మంత్రి హనుమంతుణ్ణి పంపాడు.

హనుమంతుడు సన్యాసి రూపంలో రామ లక్ష్మణుల దగ్గరికి వచ్చాడు. హనుమంతుడు సుగ్రీవుని గూర్చి రామలక్ష్మణులకు చెప్పి, తాను సుగ్రీవుని మంత్రిననీ, తనపేరు హనుమంతుడనీ చెప్పాడు. హనుమంతుడి మాటల్లోని నేర్పును రాముడు మెచ్చుకున్నాడు. హనుమంతుడు లక్ష్మణుడు తమకు సుగ్రీవుని సాయం కావాలని చెప్పాడు. హనుమ రామలక్ష్మణులను తన భుజాలపై ఎక్కించుకొని

www.sakshieducation.com

సుగ్రీవుని వద్దకు తీసుకొని వచ్చాడు. శ్రీరామ సుగ్రీవులు అగ్నిసాక్షిగా స్నేహితులయ్యారు.

సుగ్రీవుడు రామునితో ప్రాణమిత్రులుగా ఉందామని చెప్పి, తనకు వాలి భయం లేకుండా అభయం కావాలన్నాడు. వాలిని చంపుతానని రాముడు మాట ఇచ్చాడు. అపహరణకు గురైన సీతను వెదికించడానికీ, రావణుని చంపడానికీ, రాముడికి సాయం చేస్తానన్నాడు సుగ్రీవుడు. అనుకున్న ప్రకారం రాముడు వాలిని సంహరించాడు. సుగ్రీవుడు కిష్కింధకు రాజయ్యాడు. హనుమంతుని ద్వారా సీత జాడ తెలుసుకొని, రావణుని అంతమొందించారు. ఇలా శ్రీరామ సుగ్రీవులు ప్రాణ మిత్రులయ్యారు.

**17.** రాజంపేట,
15.01.2020.

ప్రియమిత్రుడు శ్రీధర్‌కు,

నీ మిత్రుడు ఖాదర్ బాష రాయు లేఖ.

నేను ఇక్కడ క్షేమం. నీవు అక్కడ క్షేమమని తలంచుచున్నాను. ముఖ్యంగా రాయు లేఖ ఏమనగా .... ఇటీవల మా తెలుగు పండితులు విద్వాన్ విశ్వం గారు రచించిన 'మాణిక్య వీణ' అనే పాఠ్యాంశాన్ని బోధించారు. చాలా చక్కగా చెప్పారు. మా మాష్టారు చెప్పిన ఈ పాఠం ఆధారంగా విద్వాన్ విశ్వం గారి కవితా శిల్పాన్ని గురించి నీకు లేఖ రాయాలని భావించి రాస్తున్నాను.

విద్వాన్ విశ్వంగారు అందరికీ తెలిసిన వాడుకభాషలో కవితను రచించారు. ఇందులోని తెలుగు నుడికారాలు బాగున్నాయి. మంత్రాలకు చింతకాయలు రాలడం, గులకరాళ్ల ములుకు మీద వంటి పలుకుబడులు కవితకు ఎంతో అందాన్నిచ్చాయి. మానవ జీవితానికి, కళలకు, విజ్ఞానానికి, మానవ మేధస్సుకు ఉన్న అవినాభావ సంబంధాన్ని విద్వాన్ విశ్వం గారు మనోహరంగా వర్ణించాడు.

ఈ 'మాణిక్యవీణ' పాఠం నాకు బాగా నచ్చింది. నీకు నచ్చిన పాఠం గురించి నాకు లేఖ రాయగలవు.

ఇట్లు,
నీ ప్రియ మిత్రుడు,
ఖాదర్ బాష.

చిరునామా: తుమ్మల శ్రీధర్ నాయుడు,
10వ తరగతి సెక్షన్ . ఏ,
జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల,
బద్వేలు, వైఎస్సార్. కడప జిల్లా,
పిన్: 516 227

**(లేదా)**

**దేశభాషలందు తెలుగు లెస్స**

మన శ్వాస తెలుగు మన ధ్యాస తెలుగు

ప్రజలారా!

మన తెలుగు భాష తేనెలొలుకు భాష. తీయని, తరగని భాష మన తెలుగు భాష. ప్రతిమాట అచ్చుతో అంతమవుతుంది. కనుక దీనిని అజంత భాష అని అంటారు. మన తెలుగు భాషలో త్యాగయ్య, క్షేత్రయ్య, అన్నమయ్య లాంటి వారి సంకీర్తనలు మన జాతికి గర్వకారణాలు. తెలుగు భాష ఎంత ప్రాచీనమైనదో అంత నవీనమైనది కూడా.

పద్యం మన సొంతం. జాతీయాలు, సామెతలు, పొడుపు కథలు, మన భాషకు నిండు దనాన్ని తెచ్చాయి. ఎన్నో భాషలు తెలిసిన శ్రీకృష్ణ దేవరాయలు మన తెలుగు భాషను గూర్చి 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని కీర్తించారు. అందుకే మనమందరం తెలుగులోనే ఆలోచిద్దాం. తెలుగులోనే మాట్లాడదాం. తెలుగులోనే జీవిద్దాం.

ఇట్లు,
తెలుగు భాష సంరక్షణ సమితి,
రాజంపేట మండల శాఖ,
వైఎస్సార్ కడప జిల్లా.

గౌరీ శంకర్ ప్రింటర్స్, రాజంపేట.
ప్రతులు : 1000

**18.** 1) నమస్కారమండీ ! మీ పూర్తి పేరు తెలుపగలరా?
2) మీ కలం పేరు ఏమిటి? ఎందుకు ఆ పేరును ఎంచుకున్నారు ?
3) మీరు స్త్రీ వాద రచయిత్రి కావడానికి కారణం?
4) మీరు గృహిణిగా, రచయిత్రిగా సంతృప్తిగా వున్నారా?
5) మీరు రచించిన రచనల్లోని ప్రముఖ రచనలను 1, 2 ప్రస్తావిస్తారా?
6) సమాజంలో ఇంకావున్న మూఢాచారాలపై రచయిత్రిగా మీ స్పందన ఏమిటి?
7) నేడు స్త్రీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటే ఏంచేస్తే బాగుంటుందో తెలపండి ?
8) సామాజికంగా, ఆర్థికంగా స్త్రీలు ఎదగడానికి మీరిచ్చే సూచనలు?
9) మీలాగ రచయిత్రులు కావా లంటే మేం ఏమి చేయాలి?
10) చివరగా... ఒక ప్రముఖ స్త్రీ వాద రచయిత్రిగా నేటి మహిళలకు మీరిచ్చే సందేశం?

**(లేదా )**

మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక అన్ని రంగాలలో ఎంతో ముందంజలో ఉన్నది. అవినీతి కూడా పెరుగుతున్నది. కొంతమంది ప్రజలు అత్యాశతో అక్రమ సంపాదనే లక్ష్యంగా చేసుకుంటున్నారు. రాజకీయ నాయకుల అవినీతి, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, ప్రభుత్వ భవన నిర్మాణాల్లో అవినీతి, ప్రభుత్వ పథకాల్లో అవినీతి... ఇలా అన్నింటా అవినీతి ఆరోపణలున్నాయి. ఈ అవినీతి దేశానికి పట్టిన దౌర్భాగ్యం.

నిత్యావసర వస్తువులు దాచి, బ్లాక్ మార్కెట్లో అమ్మడం, ధరలు పెంచడం, లంచాలు తీసుకోవడం, అర్హులైన వారికి ప్రభుత్వ సహాయం అందకపోవడం, విద్యాలయాలలో సీట్లకు లంచాలు తీసుకోవడం... ఇలా దేశంలో అవినీతి అనేది అన్నిచోట్లా తాండవిస్తోంది.

ఈ అవినీతిని అరికట్టడానికి యువతీ యువకులు ముందుకు రావాలి. పత్రికలకు లేఖలు రాసి లంచ గొండుల గురించి అవినీతి నిరోధక శాఖ వారికి తెలియజేయాలి. లంచగొండులను, అవినీతి కార్యకలాపాలు చేసేవారిని కఠినంగా శిక్షించాలి. అర్హతలు కలవారిని రాజకీయ నాయకులుగా ఎన్నుకోవాలి.

రోజుకొక అవినీతిపరుణ్ణి, లంచగొండిని, కల్తీ వ్యాపారిని, దుష్ట రాజకీయవేత్తను ప్రభుత్వానికి అప్పగించి వారికి కఠిన శిక్షలు పడేలా చూడాలి. అలా చేస్తే కొద్ది కాలంలోనే దేశంలో అవినీతి దానంతట అదే తగ్గిపోతుంది. ప్రభుత్వం చిత్తశుద్ధితో శిక్షలు అమలుచేయాలి. అవినీతి అనే చెదపురుగు దేశాన్ని నాశనం చేస్తుంది. కాబట్టి ప్రజలూ, ప్రభుత్వం ఖచ్చితంగా తమ విధులు నిర్వర్తించినట్లయితే దేశం అవినీతి రహిత దేశంగా సుభిక్షంగా ఉంటుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

## 3. భాషాంశాలు

**19.** కార్యదీక్ష, పట్టుదలతో సాధించడం అనే అర్థం వచ్చే సందర్భంలో ఈ జాతీయాన్ని ఉపయోగిస్తారు.
నేడు ప్రభుత్వోద్యోగం సాధించాలంటే అభ్యర్థులు భగీరథ ప్రయత్నం చేయాల్సిందే.

**20.** గతజలసేతు బంధనం అనే జాతీయాన్ని ఈ అర్థంలో ఉపయోగిస్తారు.
వరదలు వచ్చి జరగాల్సిన నష్టం జరిగిపోయాక ప్రభుత్వం చేపట్టే చర్యలన్నీ గత జల సేతు బంధనాలే.

**21.** చెవినిల్లు కట్టుకొని పోరు అనే జాతీయం ఈ వాక్యంలో ఉంది. మంచివారు మూర్ఖులకు ఎన్ని నీతులు చెప్పినా ప్రయోజనం ఉండదు అనే సందర్భంలో ఈ జాతీయాన్ని ఉపయోగిస్తారు.

**22.** ఇతరుల ధనాన్ని దొంగతనం చేయడం కన్నా బిచ్చమెత్తడం మంచిది.

**23.** అ) మునివరా ! నీవు శిష్యులను తీసుకొని వెంటనే రా.

**24.** వాల్మీకిచే రామాయణం రచింపబడింది.

**25.** కైకేయి రెండు వరాలను గురించి చెప్పింది.

**26.** తనకు వెన్నెలంటే చాలా ఇష్టమని మహేశ్ అన్నాడు.

**27.** 'మా ఉపాధ్యాయులు చెప్పినట్లుగా నడచుకొంటాము' అని విద్యార్థులు చెప్పారు.

**28.** మనస్విని బహుమతి సంపాదించలేదు.

**29.** వెళ్లక

**30.** ఆ) వస్తే, పోతే – చేదర్థాలు

**31.** ప్రార్థనార్థక వాక్యం

**32.** ఇ) సామర్థ్యార్థక వాక్యం

**33.** మీరు బయటకు వెళ్లవద్దు.

www.sakshieducation.com